తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

మెదక్ - మహబూబ్‌నగర్

సంగారెడ్డి | సిద్దిపేట

జోగులాంబ గద్వాల

వనపర్తి | నారాయణపేట

నాగర్ కర్నూల్

మంగళవారం

20 అక్టోబర్ 2026

Follow :




























# సంస్కృతి సాంప్రదాయాల వైభవానికి ప్రతీకలుగా బతుకమ్మ, విజయదశమి

• **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



**మెదక్ బ్యూరో, అక్టోబర్ 19 (జనంసాక్షి):** రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు, సాంస్కృతిక వైభవానికి ప్రతీకలుగా నిలిచే బతుకమ్మ, విజయదశమి (దసరా) పండుగలను పురస్కరించుకుని జిల్లా ప్రజలందరికీ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రకృతిలో సహజంగా లభించే వివిధ రకాల రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, మహిళలు, యువతులు, బాలికలు తొమ్మిది రోజుల పాటు సంప్రదాయబద్ధంగా ఆటపాటలతో బతుకమ్మ పండుగను భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించుకోవడం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబమని పేర్కొన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ, సామూహిక ఐక్యతను చాటిచెప్పే బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. విజయదశమి పర్వదినం జిల్లా ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతిసౌభాగ్యాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు నింపాలని ఆకాంక్షించారు. దసరా పండుగ ప్రతి ఒక్కరిలో నూతనోత్సాహాన్ని నింపడంతో పాటు మరిన్ని విజయాలు సాధించేందుకు దోహదపడాలని కలెక్టర్ ఆకాంక్షించారు. జిల్లా ప్రజలందరూ బతుకమ్మ, విజయదశమి పండుగలను సంప్రదాయబద్ధంగా, భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఈ సందర్భంగా సూచించారు.

## దసరా ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్ శివాజీ



**సదాశివపేట, అక్టోబర్ 19 (జనంసాక్షి):** పట్టణంలోని దుర్గా మందిరం వద్ద దసరా వేడుకల ఏర్పాట్లను కమిషనర్ శివాజీ, మున్సిపల్ ఛైర్‌పర్సన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ, వైస్ ఛైర్‌పర్సన్ రేణుక చిరు పరిశీలించారు. రావణాసురుడి దిష్టిబొమ్మ తయారీని పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. విద్యుత్ దీపాలంకరణలు ప్రజలను ఆకట్టుకునేలా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నర్సింలు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నాగరాజు గౌడ్, విద్యుత్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



## సద్దులతో ముగిసిన బతుకమ్మ వేడుకలు





**శివ్వంపేట, అక్టోబర్ 19(జనంసాక్షి):** తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిబింబంగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. శివ్వంపేట మండల పరిధిలోని దంతాన్ పల్లి, కొంతాన్ పల్లి, పోతులబోగూడ, గుండ్ల పల్లి గ్రామాల్లో సోమవారం సద్దుల బతుకమ్మ సంబురాలను మహిళలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు ఉదయం వారి వారి నివాసాలలో శుద్ధి కార్యక్రమాలు చేపట్టుకొని, వివిధ ప్రాంతాల నుంచి రంగురంగుల పూలను సేకరించి, బతుకమ్మలను అద్భుతంగా పేర్చి, సాయంత్రం బతుకమ్మలను పసుపు, కుంకుమ బోట్లతో అలంకరించి, గౌరమ్మను సైతం అద్భుతంగా తీర్చిదిద్దారు. సాయంత్రం ప్రధాన కూడళ్ల వద్ద,ఆ తర్వాత మహిళలు బతుకమ్మ ఆటపాటలతో స్థానికంగా ఉన్న చెరువు కట్టలపైన కూడా రాత్రి వరకు డీజే సౌండ్, ఎల్ఈడి లైట్ల వెలుతురులో బతుకమ్మలు ఆడుతూ మహిళలు సంబరాలు చేసుకున్నారు. చివరగా బతుకమ్మలను స్థానికంగా ఉన్న చెరువులలో సంతోషంగా నిమజ్జనం చేశారు. స్థానిక పీఏసిఎస్ చైర్మన్ వెంకట్ రాంరెడ్డి, వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు రేవా రమాకాంత్ రెడ్డి, మాజీ సర్పంచ్ సాన్వి రమాకాంత్, కన్నారం దుర్గేష్, గౌరి వెంకట్ రెడ్డి, పెంజర్ల శ్రీనివాస్ యాదవ్ లతోపాటు ఆయా గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజావాణి రెండు ఫిర్యాదులు

**కృష్ణ, అక్టోబర్ 19 (జనంసాక్షి):**
కృష్ణ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమం లో రెవిన్యూ డిపార్ట్మెంట్ కు చెందిన 2 దరఖాస్తు లు రావడం జరిగింది అని కృష్ణ మండల్ నోడల్ అధికారి ఎన్. కిషోర్ కుమార్ తెలిపారు.

ఈ యొక్క దాఖస్థులు ముదుమాల్ కు చెందింది -1 మరియు హిందూపూర్ -1, ఇ వి రెండు రెవిన్యూ డిపార్ట్మెంట్ కు చెందినవి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, వెలుగు ఏపీఎం వనితకుమారి తదితరులు పాల్గొన్నారు.

## నాగసముద్రాలలో పలువురికి సన్మానం



**కోహెడ, అక్టోబర్ 19 (జనంసాక్షి):** మండలంలోని నాగసముద్రాల గ్రామంలో వివిధ రంగాల్లో రాణిస్తున్న గ్రామ ప్రముఖులను సర్పంచ్ పెరుక సరిత, రాములు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సీఆర్పీఎఫ్, పోలీసు, ఉపాధ్యాయ, సామాజిక సేవ, సాహిత్య రంగాల్లో సేవలందిస్తున్న వారితో పాటు ప్రతిభావంతురాలైన విద్యార్థిని సురకొంటి శృతిని సత్కరించారు. సొంత గ్రామంలో గుర్తింపు పొందడం గర్వంగా ఉందని సన్మాన గ్రహీతలు తెలిపారు. యువత వివిధ రంగాల్లో రాణించి గ్రామాభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పర్వతం సారయ్య, వార్డు సభ్యురాలు జేరిపోతుల పద్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గడికోటలో మహిషాసురమర్దిని అవతారంలో అమ్మవారు దర్శనం



**పెద్ద శంకరంపేట్, అక్టోబర్ 19 (జనంసాక్షి):** దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గడికోటలో సోమవారం మహిశాసుర మర్దిని అవతారంలో అమ్మవారిని ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు పెద్ద శంకరంపేటతో పాటు ఆయా గ్రామాలలో వైభవంగా కొనసాగుతున్నాయి. ఉదయం సాయంత్రం భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయడంతో పాటు అధిక సంఖ్యలో మహిళలు భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఓడి బియ్యం సమర్పించి పూజా కార్యక్రమాలు చేస్తున్నారు. ఆయా మంటపాల నిర్వాహకులు అమ్మవారిని మంట పాలను వివిధ రకాల విద్యుత్ దీపాలతో సర్వంగా సందర్భంగా అలంకరణ చేశారు.

## పండుగ సాయన్న జయంతి పోస్టర్ ఆవిష్కరణ



**నారాయణపేట, అక్టోబర్ 19 (జనంసాక్షి):** తెలంగాణ రాబిన్‌హుడ్ పండుగ సాయన్న ముదిరాజ్ 174వ జయంతి సందర్భంగా నారాయణపేటలో ముదిరాజ్ నాయకులు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ నెల 22న హైదరాబాద్ రవీంద్రభారతిలో రాష్ట్రస్థాయి వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌తో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లోనూ జయంతి వేడుకలు అధికారికంగా నిర్వహించాలని కోరారు. ముదిరాజ్‌లు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సరాఫ్ నాగరాజ్, ఎ.కాంత్ కుమార్, బి.వెంకటయ్య, ఎ.రాము, ఆకుల బాలప్ప, కాకర్ల భీమయ్య తదితరులు పాల్గొన్నారు.



## దసరా సందర్భంగా పోలీసుల ఆయుధపూజ

**ఝరాసంగం, అక్టోబర్19 (జనంసాక్షి):** విజయ దశిమి దసరా పండగను పురస్కరించుకుని సోమవారం ఝరాసంగం పోలీస్ స్టేషన్లో ఎస్ఐ పాటీల్ క్రాంతికుమార్ అద్వర్యంలో ఆయుధపూజ నిర్వహించారు. స్టేషన్లో అమ్మవారికి చెరుకు గడలు, అరటి చెట్లతో పందిరి వేసి మామిడి ఆకులు, పూలతో తోరణాలు కట్టి, పందిరిలో ఆయుధాలు పెట్టి ఆయుధ పూజను ఘనంగా నిర్వహించారు. అనంతరం స్టేషన్ వాహనాలకు పూజలు చేశారు. ఈ సందర్బంగా ఎస్ఐ మండల ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## చేర్యాల చెక్ పోస్టు వద్ద ప్రమాదం

• **బారికేడ్లను ఢీకొన్న బైక్, వ్యక్తికి తీవ్ర గాయాలు**



**చేర్యాల, అక్టోబర్ 19(జనంసాక్షి):** యాదగిరిగుట్ట నుంచి ఆకునూరుకు బైక్ పై వెళ్తున్న వ్యక్తి ప్రమాదానికి గురయ్యాడు. రుద్రబోయిన ఎల్లేశ్ గౌడ్ సోమవారం సాయంత్రం చేర్యాల చెక్ పోస్టు వద్దకు రాగానే అదుపుతప్పి పోలీస్ బారికేడ్లను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఎల్లేశ్ గౌడ్ కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు మెరుగైన చికిత్స కోసం 108 అంబులెన్స్ ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచిన బాల్యమిత్రులు



**చేర్యాల, అక్టోబర్ 19(జనంసాక్షి):** చేర్యాల మండలంలోని వీరన్నపేట గ్రామానికి చెందిన కొట్టూరు నవీన్ కుమార్ ఇటీవల మృతి చెందడంతో విషయం తెలిసిన బాల్యమిత్రులు సోమవారం 2011-12 పదవతరగతి బ్యాచ్ సోమవారం మృతుడి కుటుంబానికి కష్ట సమయంలో తమ వంతుగా కలిసి రూ.62,600 ఆర్థిక సహాయం అందజేశారు. స్నేహం అంటే కలిసి తిరగడమే కాదు, కష్టాల్లో ఒకరికొకరు అండగా నిలవడం అని ప్రతి నిరూపించారు. ఈ సందర్భంగా బాల్యమిత్రులు మాట్లాడుతూ మాతో కలసి ఉన్న మిత్రుడు మా మధ్యలేకపోవడం బాధాకరం, మా మిత్రుడి కుటుంబానికి భవిష్యత్‌లో కూడా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

## విజయవంతంగా శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు



**జడ్చర్ల, అక్టోబర్ 19 (జనంసాక్షి):** పట్టణంలోని ఇందిరానగర్ కాలనీ లో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు తొమ్మిది రోజుల పాటు వైభవంగా జరిగాయి. మండపంలో కొలువుదీరిన దుర్గామాతకు ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. రోజుకో అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం మండప నిర్వాహకురాలు కృష్ణవేణి ఆధ్వర్యంలో కాలనీవాసులు, భక్తులు పూజల్లో పాల్గొన్నారు. భక్తుల సహకారంతో ఉత్సవాలు విజయవంతంగా ముగిశాయని నిర్వాహకులు తెలిపారు. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించి అమ్మవారి ఆశీస్సులు పొందారు.

## పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ



**హత్నూర, అక్టోబర్ 19 (జనంసాక్షి):** మండలంలోని కాసాల గ్రామ పంచాయతీ పాలకవర్గం సోమవారం ఆ గ్రామ సచివాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు.గ్రామ సర్పంచ్ కొటంల వెంకటేశం తమ సొంత ఖర్చులతో దసరా పండుగ కానుకగా కార్మికులకు దుస్తులు అందించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులు ఆనందం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో ఉప సర్పంచ్ కిష్టయ్య, పంచాయతీ కార్యదర్శి రాంచంద్రయ్య,వార్డు సభ్యులు కృష్ణ,నగేష్,యువజన నాయకులు సుభాష్,అరుణ్ గౌడ్,రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు ఫుల్... అర్జీదారులు అంతంత మాత్రమే

- ప్రజావాణికి 11 ఫిర్యాదులు
- ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి: అదనపు కలెక్టర్ పాండు





**సంగారెడ్డి, అక్టోబర్ 19 (జనంసాక్షి):** ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా, ప్రాధాన్యతనిస్తూ ఎప్పటికప్పుడు పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ పాండు అధికారులను ఆదేశించారు. సోమవారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలపై అదనపు కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారు.
ప్రజావాణికి అర్జీ దారులు అంతంత మాత్రమే ప్రతి సోమవారం ఎక్కువ సంఖ్యలో వచ్చే ఫిర్యాదులు దసరా పండుగ కావడంతో 11 దరఖాస్తులకు మాత్రమే పరిమితం. ప్రజావాణి కార్యక్రమానికి వివిధ శాఖ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 11 ఫిర్యాదులు అందాయి. డివిజన్ల వారీగా సంగారెడ్డి నుంచి 3, నారాయణఖేడ్ నుంచి 1, జహీరాబాద్ నుంచి 2 ఫిర్యాదులు రాగా, కలెక్టరేట్ ప్రజావాణికి 5 ఫిర్యాదులు అందాయి. అందోల్ డివిజన్ నుంచి ఎలాంటి ఫిర్యాదులు అందలేదు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## శ్రీ సేవాలాల్ మహా మందిరంలో మాల విరమణ



**నిజాంపేట్, అక్టోబర్ 19 (జనంసాక్షి):** నిజాంపేట్ మండలంలోని బల్కంచెర్ల తండా గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న శ్రీ విశ్వపాలిని జ్వాలాముఖి శ్రీ సేవాలాల్ మహా మందిరంలో 41 రోజుల మాల విరమణ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పాలాభిషేకం చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది. కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తిశ్రద్ధలతో సాగింది.

## చిలుముల విఠల్ రెడ్డి 13వ వర్ధంతి



**కౌడిపల్లి, అక్టోబర్ 19 (జనంసాక్షి):** కీర్తిశేషులు చిలుముల విఠల్ రెడ్డి 13వ వర్ధంతి సందర్భంగా మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ చిలుముల సుహాసిని రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. పేదల సంక్షేమం, ప్రజాసేవ కోసం విఠల్ రెడ్డి చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజలకు సేవ చేయడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో సర్పంచ్ చంద్రం కృష్ణ గౌడ్, పుండరికం గౌడ్, భూమయ్య పటేల్, మాటూరు శాఖయ్య, సింగూరి దేవేందర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## కేతకిలో మహిషాసురమర్ధిని దేవిగా భక్తులకు దర్శనమిస్తున్న దుర్గమ్మ..



**ఝరాసంగం, అక్టోబర్19 (జనంసాక్షి):** శ్రీ శరన్నవరాత్రి దుర్గాదేవి దసరా మహోత్సవముల సందర్భంగా ఝరాసంగం గ్రామంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం (నవమి) తొమ్మిదిదవ రోజు ఆలయ అర్చకులు అమ్మవారిని మెరూన్ రంగు చీరతో అలంకరించారు. అమ్మవారు శ్రీ మహిషాసుర మర్ధిని దేవీగా భక్తులకు దర్శనమిచ్చారు.భక్తులు అమ్మవారి పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ పూజ కార్యక్రమంలో ఝరాసంగం మాజీ ఎంపీటీసీ రజినిప్రియ సంతోష్ పాటిల్, ఏపిఓ రాజ్ కుమార్, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ..



**ఝరాసంగం,అక్టోబర్19(జనంసాక్షి):** ఝరాసంగం మండల పరిధిలోని బిడకన్నె గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు బోయిని లక్ష్మమ్మ నూతన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ముగ్గుపోశారు. అనంతరం నూతన ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రాలను గ్రామ సర్పంచ్ సి.రవి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు,పంచాయతీ కార్యదర్శి గ్రామస్తులు పాల్గొన్నారు.

## మెలిగిరిపేటలో ఘనంగా బతుకమ్మ సంబరాలు





**సదాశివపేట, అక్టోబర్ 19(జనంసాక్షి):** మెలిగిరిపేట గ్రామంలో గ్రామ సర్పంచ్ షాబుద్దీన్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, ఊరేగింపుగా తీసుకువచ్చారు. అనంతరం సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలతో ఉత్సాహంగా పండుగను జరుపుకున్నారు. ఈ వేడుకల్లో గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ సంబరాలను విజయవంతం చేశారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

## తిమ్మాయపల్లిలో వైభవంగా శ్రీ సప్తశతి చండీయాగం







**నంగునూరు, అక్టోబర్ 19 (జనంసాక్షి):** నంగునూరు మండలం తిమ్మాయపల్లి గ్రామంలో శ్రీదేవి శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీ సప్తశతి చండీయాగాన్ని అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. “ది రాక్ స్టార్ యూత్ అసోసియేషన్”, “రెడ్డి సంఘం” సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం పవిత్రమైన వాతావరణంలో జరిగింది.
ప్రముఖ వేద పండితులు అజయ్ శర్మ, వారి శిష్య బృందం నేతృత్వంలో శాస్త్రోక్తంగా హోమాలు, ప్రత్యేక పూజలు నెరవేర్చారు. ఈ సందర్భంగా వేద పండితులు అజయ్ శర్మ మాట్లాడుతూ... శ్రీ సప్తశతి చండీయాగం నిర్వహించడం వల్ల మానసిక ప్రశాంతత, ఆయురారోగ్యాలు, ధనలాభం, అష్టైశ్వర్యాలు చేకూరుతాయని భక్తులకు వివరించారు. హోమం కార్యక్రమం భక్తులకు మహా అన్న ప్రసాద కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చేర్యాల రాజు, రెడ్డి సంఘం సభ్యులు ది రాక్ స్టార్ యూత్ సభ్యులు,గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## దాబాలో కార్మికుడి అనుమానాస్పద మృతి...





**పుల్కల్, అక్టోబర్ 19 (జనంసాక్షి):** దాబాలో పనిచేస్తున్న కార్మికుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన పుల్కల్ మండలంలో చోటుచేసుకుంది.నైలాన్ తాడుతో ఉరివేసుకున్న స్థితిలో రమేష్ మృతదేహం కనిపించింది.తన అన్న మృతిపై అనుమానాలు ఉన్నాయని, ఘటనకు గల కారణాలను సమగ్రంగా విచారించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మృతుడి తమ్ముడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదుదారుడి వివరాల ప్రకారం.. ఏడుగురు సంతానంలో రమేష్ పెద్దవాడు కాగా, ఫిర్యాదుదారుడు చిన్నవాడు. రమేష్ గత ఆరు నెలలుగా పెద్ద రెడ్డి పేట గ్రామం లింగయ్యకు చెందిన దాబాలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు.అక్టోబర్ 18న మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో జోగిపేటలో తన అన్నను కలిసినట్లు తమ్ముడు తెలిపాడు.ఇద్దరూ కొద్దిసేపు వ్యక్తిగత విషయాలపై మాట్లాడుకున్న అనంతరం రమేష్ దాబాకు పనిమీద వెళ్లిపోయినట్లు పేర్కొన్నాడు. అదే రోజు రాత్రి సుమారు 8 గంటల సమయంలో దాబాలో కార్మికులు ఉండే గది తలుపు లోపలి నుంచి గడియపెట్టి ఉండటాన్ని గమనించారు. తలుపు సందులోంచి చూడగా రమేష్ నైలాన్ తాడుతో ఉరివేసుకున్న స్థితిలో కనిపించాడు. దీంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, తన అన్నయ్య భార్య శాంతాబాయి, మరో అన్నయ్యతో కలిసి అక్కడికి వెళ్లి చూడగా రమేష్ అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. అన్న మృతికి గల అసలు కారణాలు తెలియడం లేదని, ఘటనపై అనుమానాలు ఉన్నాయని ఫిర్యాదుదారుడు పేర్కొన్నాడు. రమేష్ మృతికి దారితీసిన పరిస్థితులపై అన్ని కోణాల్లో విచారణ జరిపి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని పోలీసులను కోరాడు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల విచారణ పూర్తయితేనే రమేష్ మృతికి గల అసలు కారణాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

## ఆపదలో ఆదుకొని మానవత్వాన్ని చాటుకున్న భాస్కర్ నాయక్







**మిడ్జిల్, అక్టోబర్ 19 (జనంసాక్షి):** రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని ప్రజాసేవకుడు జరుపుల భాస్కర్ నాయక్ తన సొంత వాహనంలో మాజీ ఎంపీపీ సుదర్శన్‌తో కలిసి మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. ఆపదలో ఉన్నవారికి వెంటనే స్పందించి అండగా నిలిచిన భాస్కర్ నాయక్ సేవా భావాన్ని. మంచి మనసును. పలువురు అభినందించారు. ఇలాంటి వ్యక్తి ప్రజలలో ఉండటం సంతోషకరంగా ఉందని ప్రజలు అంటున్నారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

# పటాన్చెరులో అంబరాన్నంటిన సద్దుల బతుకమ్మ సంబరాలు

- ఎమ్మెల్యే జీఎంఆర్ ఆధ్వర్యంలో సాకి చెరువు కట్టపై పూల పండుగ
- విజేతలకు రూ.50 వేల నగదు బహుమతులు, పట్టు చీరల ప్రదానం







**పటాన్చెరు, అక్టోబర్ 19 (జనంసాక్షి):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలు పటాన్చెరులో అంబరాన్నంటాయి. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి (జీఎంఆర్) ఆధ్వర్యంలో సాకి చెరువు కట్టపై ఆదివారం నిర్వహించిన సంబరాలకు వేలాదిమంది మహిళలు తరలివచ్చారు. రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలు, జానపద గీతాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో పరిసరాలు పండుగ శోభను సంతరించుకున్నాయి.

**ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ...** ప్రకృతిని ప్రేమిస్తూ పూలను పూజించే అరుదైన పండుగ బతుకమ్మ అని పేర్కొన్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధానికి, మన సంస్కృతి సంప్రదాయాల గొప్పతనానికి ఈ పండుగ ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ప్రజల ఆశీస్సులు, ఆదరణతో వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించడం గర్వ కారణమని తెలిపారు. పటాన్చెరు ప్రజలు తనపై చూపిస్తున్న ప్రేమాభిమానాలను జీవితాంతం మరువ లేనని పేర్కొన్నారు. గత 15 ఏళ్లుగా బతుకమ్మ సంబరాలను నిర్వహిస్తూ తెలంగాణ సంస్కృతిని భావితరాలకు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

**రచ్చ రవి బృందం ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణ...**

ప్రముఖ నటుడు, హాస్య కళాకారుడు రచ్చ రవి నేతృత్వంలోని బృందం నిర్వహించిన వినోదభరిత సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. కాజిపల్లి భరత్ ఆధ్వర్యంలో బతుకమ్మ పాటలు, జానపద సంగీత కార్యక్రమాలు ఉత్సాహాన్ని నింపాయి.

**విజేతలకు నగదు బహుమతులు...**

సంప్రదాయబద్ధంగా, సృజనాత్మకంగా బతుకమ్మలను అలంకరించిన మహిళలకు ప్రోత్సాహకంగా పోటీలు నిర్వహించారు. విజేతలకు మొత్తం రూ.50 వేల నగదు బహుమతులతో పాటు పట్టు చీరలను అందజేశారు. ఎమ్మెల్యే సతీమణి గూడెం యాదమ్మ మహిపాల్ రెడ్డి, కుమార్తె, కోడలు, మనుమరాళ్లు మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు.

ఈ వేడుకల్లో పట్టణ ప్రముఖులు, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాకి చెరువు కట్టపై జరిగిన ఈ సంబరాలు తెలంగాణ సంస్కృతి వైభవాన్ని చాటిచెప్పాయి.

## అమ్మవారి దయతో అందరికీ విజయాలు: మున్సిపల్ వైస్ చైర్మన్ రేణుక చిరు



**సదాశివపేట, అక్టోబర్ 19 (జనంసాక్షి):** దసరా పండుగ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ విజయాలు సాధించి, అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ రేణుక చిరు ఆకాంక్షించారు. సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని, అనావృష్టి నుంచి విముక్తి కలగాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక దసరా పండుగ అని పేర్కొన్నారు.

## దుర్గామాత విగ్రహాన్ని అందజేసిన ధనురాజ్ ముదిరాజ్



**కొల్చారం, అక్టోబర్ 19 (జనంసాక్షి):** మెదక్ జిల్లా కుల్చారం మండలం పోతంశెట్టిపల్లి గ్రామంలో పోచమ్మ గుడి సమీపంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహించేందుకు అప్పాజిపల్లి గ్రామానికి చెందిన కన్నెబోయిన ధనురాజ్ ముదిరాజ్ దుర్గామాత విగ్రహ దాతగా వ్యవహరించారు. దుర్గామాత విగ్రహాన్ని అందజేసి అమ్మవారి పట్ల తన భక్తిని చాటుకున్న ధనురాజ్ ముదిరాజ్‌ను గ్రామస్తులు అభినందించారు. దుర్గామాత ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ఆకాంక్షించారు. దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు ఆయన్ను శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## నాగ్వార్‌లో ఇందిరమ్మ నూతన గృహం ప్రారంభం



**రాయికోడ్, అక్టోబర్ 19(జనంసాక్షి):** మండల పరిదిలోని నాగ్వర్ గ్రామంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సి.దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు సోమవారం కునాదొడ్డి శంకర్ నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లును మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ సిద్దన్నపాటిల్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కేదార్నాథ్ పాటిల్‌లతో కలిసి రూబెన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ శుభసందర్భంగా లబ్ధిదారునికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహ సహకారంతో అర్హత గల ప్రతి ఒక్కరికి నూతన ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు బాలాజీ నర్సిములు, బస్వారాజ్ పాటిల్, ఞావీజ వైస్ చైర్మన్ వినయ్, సర్పంచులు గురుదాస్, రాజశేఖర్ గౌడ్,మాజీ యూత్ అధ్యక్షులు ప్రభాకర్,నాయకులు రాజు కురుమ, రఫీక్, ఎండి సుల్తాన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ విట్టల్, పలువురు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చీరలను పంపిణీ చేసిన నవీన్ గుప్తా



**శివ్వంపేట, అక్టోబర్ 19(జనంసాక్షి):** దేశంలో హిందూ సమాజానికి అతి పెద్ద పండగ దసరా పండుగ వేడుకలను ఆనందోత్సవల మధ్య జరుపుకుందామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పులిమామిడి నవీన్ గుప్తా పేర్కొన్నారు. మండల కేంద్రమైన శివ్వంపేట మహిళలకు బతుకమ్మ కానుకగా సోమవారం నవీన్ గుప్త చీరలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు పండుగ పూట సంతోషం ఉండాలని, వేడుకలను జరుపుకోవాలనే సదుద్దేశ్యంతో దసరా కానుకగా తమ స్వంతంగా చీరలను ఇవ్వడం జరిగిందన్నారు. దసరా ఉత్సవాలలో భాగంగా రావణదహనం కార్యక్రమన్ని అత్యంత వైభవంగా నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. దసరా కానుక చీరలను అందించిన దాత నవీన్ గుప్తకు గ్రామ మహిళలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు వారాల గణేష్, ఈసారపు రాజు గౌడ్, బిస్కుంద్ అంజయ్య, దేవనబోయిన కృష్ణ, వంజరి నాగభూషణం, మాజీ కో ఆప్షన్ మెంబర్ దావుద్ పాల్గొన్నారు.

## రవికుమార్ కుటుంబానికి బీజేపీ నాయకుల ఆర్థికసాయం



**వనపర్తి, అక్టోబర్ 19 (జనంసాక్షి):** వనపర్తి మున్సిపాలిటీ ఐదో వార్డుకు చెందిన గంధం రవికుమార్ గుండె నొప్పితో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు అయ్యగారి ప్రభాకర్ రెడ్డి ఆయన భౌతికకాయానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కష్టకాలంలో అండగా ఉంటామని భరోసా ఇచ్చి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది రాజు, సుబ్రహ్మణ్యం, ఆగుపోగు కుమార్, నక్క మహేష్ యాదవ్, గంధం బాలపీర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన...

- సర్పంచ్ దత్తును అభినందించిన గ్రామ ప్రజలు




**మనూరు, అక్టోబర్19 (జనంసాక్షి):** ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని నారాయణఖేడ్ నియోజకవర్గం మనూరు మండల పరిధిలోని దోసపల్లి గ్రామ సర్పంచ్ బిరాధర్ దత్తు అన్నారు. సోమవారం దత్తు నిర్వహించిన బాలాజీ అనురాధ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో వైద్యులు రక్తపోటు, షుగర్, కంటి పరీక్షలు తదితర ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు నిర్వహించి,అవసరమైన వారికి వైద్య సలహాలు అందించారు.

అనారోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యులను సంప్రదించాలని వైద్యులు సూచించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామీణ, పేద ప్రజలకు ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని సర్పంచ్ దత్తు తెలిపారు. అనంతరం సర్పంచులు గ్రామ ప్రజలు తదితరులు అభినందించారు.

## వాలీబాల్ టోర్నీలో ఊర్కొండపేట జట్టుకు ద్వితీయ స్థానం



**ఊర్కొండ, అక్టోబర్ 19 (జనంసాక్షి):** తాండ్ర గ్రామంలో నిర్వహించిన కాయితి ప్రభాకర్ రెడ్డి స్మారక కల్వకుర్తి తాలూకా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో ఊర్కొండపేటకు చెందిన జహీర్ కోచ్ జట్టు ద్వితీయ స్థానం సాధించింది. కోచ్‌గా క్రీడాకారులకు శిక్షణ ఇస్తూనే జట్టులో ఆడుతున్న జహీర్, తన శిష్యులను జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తూ వాలీబాల్ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగే టోర్నీల్లో జట్టు ప్రతిభ చాటుతూ ఊర్కొండపేటకు గుర్తింపు తెస్తోంది.

## క్రీడాస్ఫూర్తిని చాటిన నాగపూర్ యువత..

- దసరా వేడుకల్లో కబడ్డీ సందడి!
- గ్రామ ఐక్యతకు ప్రతీకగా క్రీడా పోటీలు.. క్రీడాకారులను ప్రోత్సహించిన గ్రామ పెద్దలు



**రేవల్లి, అక్టోబర్ 19 (జనంసాక్షి):** దసరా పండుగ సందర్భంగా రేవల్లి మండలంలోని నాగపూర్ గ్రామంలో నిర్వహించిన కబడ్డీ పోటీలు యువతలో ఉత్సాహాన్ని నింపాయి. పండుగ వేళ ఆటపాటలతో ఆనందాన్ని పంచుకుంటూ, క్రీడాస్ఫూర్తిని చాటుతూ క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

నాలుగు జట్లు తలపడిన ఈ పోటీల్లో ఫైనల్ పోరు నవీన్, అంజి జట్ల మధ్య ఉత్కంఠభరితంగా సాగింది. హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో చివరికి అంజి జట్టుపై 8 పాయింట్ల తేడాతో నవీన్ జట్టు విజయం సాధించింది.

దసరా పండుగ అంటే కేవలం వేడుకలు మాత్రమే కాదు.. గ్రామ ప్రజలంతా ఒక్కచోట చేరి ఆప్యాయతలను పంచుకునే పండుగ. ఇలాంటి సందర్భాల్లో క్రీడా పోటీలు యువతలో ఐక్యతను, క్రమశిక్షణను, స్నేహభావాన్ని పెంపొందిస్తాయని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తూ బహుమతులు ప్రకటించడం అభినందనీయమని, యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు.

ఈ పోటీల్లో మొదటి బహుమతిగా రూ.4,016 ను బీఆర్ఎస్ సోషల్ మీడియా వనపర్తి జిల్లా నాయకులు చిట్టి రాజుల నరసింహ, రెండో బహుమతిగా రూ.2,516 ను రేవల్లి మండల రజక సంఘం అధ్యక్షుడు చిట్టి రాజుల శేఖర్ అందజేశారు. హరిహర టెంట్ హౌస్ నాగపూర్ ఆధ్వర్యంలో బాలరాజు ఈ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, క్రీడాకారులు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పండుగ వేళ క్రీడల ద్వారా గ్రామంలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి.

### ప్రజలకు దసరా శుభాకాంక్షలు
# తెలిపిన మాజీ ఉపసభాపతి పద్మాదేవేందర్‌రెడ్డి

- ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలి



**మెదక్ టౌన్ సెప్టెంబర్ 19(జనంసాక్షి):** విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని మెదక్ జిల్లా ప్రజలకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఉపసభాపతి ఎం. పద్మాదేవేందర్‌రెడ్డి దసరా శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దసరా పండుగ ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. దసరా పండుగ ప్రతి ఒక్కరినీ సన్మార్గంలో నడిపించే స్ఫూర్తిని అందిస్తుందని పేర్కొన్నారు. తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహించుకున్న ప్రజలంతా విజయదశమిని ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ పండుగను ఐకమత్యంతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. జగన్మాత ఆశీస్సులతో జిల్లా ప్రజలంతా సుఖశాంతులతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని, ప్రతి కుటుంబంలో విజయాలు, ఆనందాలు వెల్లివిరియాలని కోరారు. దుర్గామాత దీవెనలు ప్రతి ఒక్కరిపై ఉండాలని, ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు నిండాలని ఆకాంక్షించారు.

## కోహీర్ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు అశోక్‌కు ఘన సన్మానం



**కోహీర్, అక్టోబర్ 19 (జనంసాక్షి):** కోహీర్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు అశోక్‌ను జహీరాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయంలో మాజీ మంత్రి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి డా. ఎ. చంద్రశేఖర్ శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా అశోక్ ప్రజా సమస్యల పరిష్కారానికి, గ్రామాల అభివృద్ధికి కృషిచేయాలని ఆకాంక్షించారు. సర్పంచులు సమన్వయంతో పనిచేస్తూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు, ప్రభుత్వ పథకాల అమలుకు ప్రాధాన్యత ఇవ్వాలని నాయకులు సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు టి. సువర్ణ మల్లన్న పాటిల్, బ్లాక్ అధ్యక్షుడు హర్షద్ అలీ, కండెం నర్సింలు, బాబు, శ్యాంసన్, మాజీ సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# అప్పుల బాధతో రైతు ఆత్మహత్య...

- రెండు బోర్లు వేసినా అందని నీరు.. ఎండిపోయిన వరి పంట
- రూ.3 లక్షల అప్పులు తీర్చలేక బలవన్మరణం



**కొల్చారం, అక్టోబర్ 19 (జనంసాక్షి):** అప్పుల బాధతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన కొల్చారం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కుమ్మరి కిష్టయ్య (54) సాగునీటి కోసం రెండు బోర్లు వేయించినా నీరు పడకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. మరోవైపు నీరందక వరి పంట ఎండిపోవడంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

**రెండు బోర్లు వేసినా ఫలితం శూన్యం...**

కొల్చారం గ్రామ శివారులో కిష్టయ్యకు ఎకరం వ్యవసాయ భూమి ఉంది. అందులో పంట సాగు చేసేందుకు సుమారు మూడు నెలల క్రితం రెండు బోర్లు వేయించాడు. అయితే రెండింటిలోనూ నీరు పడలేదు. దీంతో బోర్ల కోసం చేసిన ఖర్చుతో పాటు వ్యవసాయ పెట్టుబడులు కలిపి సుమారు రూ.3 లక్షల అప్పులు అయినట్లు సమాచారం. సాగు చేసిన వరి పంటకు నీరు అందక పూర్తిగా ఎండిపోయింది. దీంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక గత వారం రోజులుగా తీవ్ర ఆవేదనకు గురవుతున్నట్లు తెలిసింది.



**ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి..**

అప్పుల బాధతో మనస్తాపానికి గురైన కిష్టయ్య ఆదివారం రాత్రి ఇంటి సమీపంలో ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతడిని కిందకు దించి, అంబులెన్స్‌లో మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

**కేసు నమోదు చేసిన పోలీసులు...**

సమాచారం అందుకున్న కొల్చారం ఎస్సై మహమ్మద్ మొహినుద్దీన్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# చికిత్స పొందుతున్న వ్యక్తికి ఆర్థిక సహాయం



**మహమ్మదాబాద్,అక్టోబర్ 19 (జనంసాక్షి):** అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నిరుపేద కుటుంబానికి దాతలు అండగా నిలిచారు.మహమ్మదాబాద్ మండలం గాధిర్యాల్ గ్రామానికి చెందిన బోడ హన్మంతు షుగర్ వ్యాధితో వారం రోజులుగా మల్లిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.చికిత్స ఖర్చులు భరించలేని పరిస్థితిలో ఉన్న బాధిత కుటుంబానికి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు బోరు కృష్ణయ్య,ప్రత్యేక చొరవ తీసుకొని,వాట్సాప్ గ్రూపుల ద్వారా సమాచారం అందించగా,ప్రజాప్రతినిధులు,రాజకీయ నాయకులు, యువకులు, దాతలు స్పందించారు.మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ,ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు పసుల రాజు, సైతం ఆర్థిక సాయం. సేకరించిన రూ.30వేల నగదును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈకార్యక్రమంలో రాజు,అంజిలయ్య,గండీడ్ మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు వెంకటయ్య,చిన్నయ్య,బాబు,సతీష్,రాములు తదితరులు పాల్గొన్నారు.

# టీ.జీ.పీ.ఎస్.సీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

### పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి: కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 19 (జనంసాక్షి):** ఈ నెల 24న నిర్వహించనున్న టీ.జీ.పీ.ఎస్.సీ కంప్యూటర్ ఆధారిత పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. పరీక్షల నిర్వహణపై కమిషన్ చైర్మన్ బుర్రా వెంకటేశం సోమవారం వీడియో సమావేశం ద్వారా అధికారులతో సమీక్షించారు. పటాన్‌చెరు మండలం రుద్రారం గీతం విశ్వవిద్యాలయంలో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అసిస్టెంట్ సైంటిస్ట్ పోస్టులకు రెండు విడతల్లో పరీక్షలు నిర్వహిస్తామని, జిల్లాలో 150 మంది అభ్యర్థులు హాజరవుతారని పేర్కొన్నారు. మొదటి విడత ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, రెండో విడత మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందన్నారు.

మొదటి విడతకు ఉదయం 9.30 గంటలకు, రెండో విడతకు మధ్యాహ్నం 2 గంటలకు ప్రవేశ ద్వారాలు మూసివేస్తామని తెలిపారు. అభ్యర్థులు సమయానికి చేరుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రంలోకి చరవాణులు, పుస్తకాలు, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు. కట్టుదిట్టమైన భద్రతతో పరీక్షలు పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, అదనపు కలెక్టర్ పాండు తదితరులు పాల్గొన్నారు.

# టీ.జీ.పీ.ఎస్.సీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

### ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు: కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్ బ్యూరో, అక్టోబర్ 19 (జనంసాక్షి):** ఈ నెల 24న నిర్వహించనున్న టీ.జీ.పీ.ఎస్.సీ కంప్యూటర్ ఆధారిత పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ కళాశాలలో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అసిస్టెంట్ సైంటిస్ట్ (అనలిస్ట్ (గ్రేడ్-II) పోస్టులకు రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయని, జిల్లాలో 200 మంది అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు. మొదటి సెషన్ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారు. గేట్లు నిర్ణీత సమయానికి మూసివేస్తారని, మొబైల్ ఫోన్లు, పుస్తకాలు, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. పరీక్షలు పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఏవో యూనస్, తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# పోలీస్ వేధింపులపై అఖిలపక్షం ఆగ్రహం

### వీరేష్ మృతిపై విచారణ జరిపించాలి.. ధరూర్ ఎస్సైని సస్పెండ్ చేయాలి



**గద్వాల, అక్టోబర్ 10 (జనంసాక్షి):** జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం బురెడ్డిపల్లికి చెందిన కురువ వీరేష్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. పోలీస్ స్టేషన్‌లో తనను కొట్టి వేధించారని, ఆ మనోవేదనతోనే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు మరణానికి ముందు వీరేష్ తెలిపినట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఈ ఘటనపై అఖిలపక్ష కమిటీ నాయకులు జిల్లా ఎస్పీకి వినతిపత్రం సమర్పించారు. వీరేష్ మృతికి కారణమయ్యారని ఆరోపిస్తున్న రాజకీయ నాయకులను అరెస్టు చేయాలని, ధరూర్ ఎస్సైపై శాఖాపరమైన విచారణ జరిపి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో బిజ్వారానికి చెందిన వడ్డే రాజేశ్వరి విషయంలోనూ ఎస్సై బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని నాయకులు ఆరోపించారు. పోలీసుల వేధింపులపై సమగ్ర విచారణ జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్, ఎంఆర్‌పీఎస్, సీపీఎం, టీపీఎఫ్, పౌరహక్కుల సంఘం, భీమ్ ఆర్మీ తదితర ప్రజా, రాజకీయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# కురిడి లిఫ్ట్ తో అలంపూర్ రైతులకు అన్యాయం

- ఐజ మాజీ ఎంపీపీ ప్రహల్లాద రెడ్డి



**అయిజ, అక్టోబర్ 19 (జనంసాక్షి):** రాజోలిబండ ఆనకట్టను సందర్శించిన అయిజ మాజీ ఎంపీపీ ప్రహ్లాద రెడ్డి.విడుదలైన సాగునీటిని అయిజ మండలం రైతులకు సక్రమంగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, అలాగే కురిడి లిఫ్ట్‌తో తెలంగాణ అలంపూర్ తాలూకా ప్రాంత రైతులకు అన్యాయం జరుగుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్‌నినో ప్రభావం వల్ల రైతులకు సాగునీరు సక్రమంగా అందటం లేదు. రాజోలిబండ ఆనకట్ట నుంచి అలంపూర్ రైతులకు అధికారులు సాగునీరు విడుదల చేశారు. ఆదివారం సాయంత్రం అయిజ మండలం సింధనూర్ గ్రామం వద్ద ఉన్న 12వ డిస్ట్రిబ్యూటర్ కు చేరాయి. దాదాపు విడుదలైన 3 టీ ఎం సి ల నీటిలో నుండి అధికారులు రోజుకు 2500 క్యూసెక్కుల నీటిని ఆనకట్ట నుంచి దిగువకు వదులు తున్నారు. ఈ నీటిని రైతులకు ప్రణాళికా బద్ధంగా అధికారులు అందించాలని ఆయన సూచించారు. ఆనకట్ట వద్ద ప్రవాహ పరిస్థితిని పరిశీలించారు. కురిడి లిఫ్ట్ తో తెలంగాణ రైతులకు అందే సాగునీటికి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని, తెలంగాణ ప్రభుత్వం ఈ విషయంపై విచారణ చేసి రైతులకు నష్టం జరగకుండా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆర్డీఎస్ ఆనకట్ట సందర్శించిన వారిలో సింధనూర్ సర్పంచ్ ఇంద్రసేనగౌడ్, రవిరెడ్డి, మేడికొండ మాజీ సర్పంచ్ వెంకటేష్ ఉన్నారు.

## అక్టోబర్ 21 నుంచి బ్యాంకింగ్ సేవలపై ప్రత్యేక శిబిరాలు

- డిసెంబర్ 31 వరకు నిర్వహణ..
- ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి, అక్టోబర్ 19(జనంసాక్షి):**
జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలకు బ్యాంకింగ్ సేవలు, కేంద్ర ప్రభుత్వ సామాజిక భద్రతా పథకాలను చేరువ చేయాలనే లక్ష్యంతో అక్టోబర్ 21 నుంచి డిసెంబర్ 31 వరకు ప్రత్యేక ప్రచార శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు.
జిల్లాలోని 15 మండలాల పరిధిలో ఉన్న 268 గ్రామ పంచాయతీలతో పాటు ఐదు మున్సిపాలిటీల పరిధిలో కేటాయించిన బ్యాంకుల ఆధ్వర్యంలో ఈ శిబిరాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రతి గ్రామంలో ఒక శిబిరాన్ని ఏర్పాటు చేసి, ప్రజలకు వివిధ బ్యాంకింగ్ సేవలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు.
ఈ శిబిరాల్లో ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాలలో అర్హులైన వారికి నమోదు ప్రక్రియపై అవగాహన కల్పిస్తారు. అలాగే డిజిటల్ బ్యాంకింగ్ మోసాల నివారణ, బ్యాంకు ఖాతాల పునరుద్ధరణ, కిసాన్ క్రెడిట్ కార్డు (కేసీసీ) సేవలు, క్లెయిమ్ చేయని బ్యాంకు డిపాజిట్లకు సంబంధించిన వివరాలను ప్రజలకు తెలియజేయనున్నారు. ప్రజలు ఈ ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకుని, తమకు అందుబాటులో ఉన్న బ్యాంకింగ్ సేవలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంపొందించుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు.



## ఈ నెల 22న పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలు

- కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 19(జనంసాక్షి):**
దివంగత పండుగ సాయన్న ముదిరాజ్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వము అధికారిక వేడుకగా నిర్వహించనున్న నేపథ్యంలో, ఈ నెల 22న ఉదయం 10:30 గంటలకు సంగారెడ్డి సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జయంతి వేడుకలు నిర్వహించ నున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ నేడు ఒక ప్రకటనలో తెలిపారు.
ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ నగేష్



**మెదక్ బ్యూరో, అక్టోబర్ 19(జనంసాక్షి):**
ప్రజావాణి దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలనీ అదనపు కలెక్టర్ నగేష్ అధికారులకు సూచించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా మెదక్ కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజల నుంచి పిర్యాదులను స్వీకరించారు. మొత్తం( సాధారణ )16 దరఖాస్తులు వచ్చాయి.
**ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ..**
ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిశీలించి పరిష్కరించాలని, సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈఓ ఎల్లయ్య, ఏ,వో యూనస్,జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## గార్లపాటి మధుసూదన్ రెడ్డికి ఎమ్మెల్యే విజయుడు నివాళులు



**వడ్డేపల్లి, అక్టోబర్ 19 (జనంసాక్షి):**
రామాపురం గ్రామానికి చెందిన గార్లపాటి మధుసూదన్ రెడ్డి గుండెపోటుతో మృతి చెందగా, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు ఆయన నివాసానికి వెళ్లి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కష్టకాలంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఏడుపాయల వనదుర్గమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి

- అమ్మవారికి ప్రత్యేక పూజలు..
- ప్రజల సుఖసంతోషాల కోసం ప్రార్థన



**కొల్చారం, అక్టోబర్ 19 (జనంసాక్షి):** మెదక్ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ ఏడుపాయల వనదుర్గ భవానీ మాతను నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ప్రార్థించారు. ప్రజలకు శాంతి, సౌభాగ్యాలు కలగాలని వనదుర్గమ్మను ఎమ్మెల్యే వేడుకున్నారు.

### జూనియర్ సివిల్ జడ్జిగా
## రాజాపేట వాసి గద్వాల గోవింద్ ఎంపిక



**వనపర్తి, అక్టోబర్ 19 (జనంసాక్షి):** జిల్లాలోని రాజాపేట గ్రామానికి చెందిన గద్వాల గోవింద్ తెలంగాణ రాష్ట్ర జ్యుడీషియల్ సర్వీస్‌లో జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా హిందూ వాహిని విభాగ్ కన్వీనర్ అభిలాష్ హౌదేకార్, ఆయన మిత్ర బృందం ఉస్మానియా క్యాంపస్‌లో గోవింద్‌ను ఘనంగా సన్మానించి అభినందించారు. పట్టుదలతో చదివి న్యాయమూర్తి పదవికి ఎంపిక కావడం అభినందనీయమని పేర్కొన్నారు. స్వామి వివేకానంద స్ఫూర్తితో, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ఆయన విజయం సాధించారని తెలిపారు. గోవింద్ విజయం యువతకు స్ఫూర్తిదాయకమని, న్యాయమూర్తిగా నిజాయితీ, నిష్పక్షపాతంతో విధులు నిర్వహించి ప్రజలకు న్యాయం అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో న్యాయవాదులు రవి, భైరవ రెడ్డి, గోవింద్ మిత్రులు పాల్గొన్నారు.

## శ్రీ మహిషాసుర మర్ధిని దేవిగా బంగారు మైసమ్మ



**జడ్చర్ల, అక్టోబర్ 19 (జనంసాక్షి):** కావేరమ్మపేట ఐబీ బంగ్లా సమీపంలోని 44వ జాతీయ రహదారి పక్కన ఉన్న శ్రీ బంగారు మైసమ్మ ఆలయంలో మహార్నవమి సందర్భంగా అమ్మవారు మహిషాసుర మర్ధిని దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.
ఈ సందర్భంగా పంచామృతాభిషేకం, కుంకుమార్చన, అష్టోత్తర పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గోనెల నరేందర్ భక్తులకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి దసరా ప్రతీక అని, అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీదుర్గ మాత శరన్నవరాత్రి ఉత్సవాలు



**ఉర్కొండ, అక్టోబర్ 19, (జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండల కేంద్రంలో శ్రీ దుర్గ మాత శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక యాగంలో ఊర్కొండ సర్పంచ్ మ్యాకల మంజుల శ్రీనివాసులు దంపతులు పాల్గొన్నారు. అర్చకులు మహేష్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిరోజు భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్పంచ్ మంజుల శ్రీనివాసులు గ్రామ ప్రజలు రైతులు సుఖశాంతులతో ఉండాలని పూజలు, యజ్ఞాలు చేయడం జరిగిందని తెలియజేశారు.

## ఉజ్వల భవిష్యత్తు ఉన్న విద్యార్థిని మృతి తీవ్ర విషాదం

- ప్రత్యూష పార్థివదేహానికి నివాళులర్పించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి
- ఆపద సమయంలో మిత్రుని కుటుంబానికి అండగా బాల్యమిత్రులు





**వనపర్తి రూరల్, అక్టోబర్ 19 (జనంసాక్షి):**
ఉజ్వల భవిష్యత్తు ఉన్న విద్యార్థిని ప్రత్యూష (సోని) ప్రమాదవశాత్తు మృతి చెందడం తీవ్ర విషాదకరమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు.వనపర్తి పట్టణంలోని 14వ వార్డుకు చెందిన నారాయణదాస్ అశోక్ చారికవల కుమార్తెలు ప్రత్యూష, మీనా హైదరాబాద్‌లోని ఎంవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. కళాశాల ఉత్సవంలో జరిగిన ప్రమాదంలో ప్రత్యూష మృతి చెందగా, ఆమె సోదరి మీనా తీవ్రంగా గాయపడి యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.
ప్రత్యూష పార్థివదేహం వనపర్తిలోని స్వగృహానికి చేరుకోవడంతో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అక్కడికి చేరుకుని పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. చదువులో రాణిస్తూ భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న ప్రత్యూష అకాల మరణం కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబానికి మనోధైర్యం కలగాలని, చికిత్స పొందుతున్న మీనా త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వాకిటి శ్రీధర్, జ్యోతి రమణ, లక్ష్మీనారాయణ, ఉంగ్లం తిరుమల్, భాను, మోహనాచారి, గోకం శివ తదితరులు పాల్గొన్నారు.

**మిత్రుని కుటుంబానికి బాల్యమిత్రుల అండ...**
కుమార్తెను కోల్పోయి విషాదంలో ఉన్న అశోక్ చారి కుటుంబానికి ఆయన బాల్యమిత్రులు అండగా నిలిచారు. కుటుంబానికి ధైర్యం చెబుతూ అవసరమైన సహకారం అందిస్తున్నారు. ప్రత్యూష మృతి, మీనా గాయపడిన ఘటనపై కుటుంబానికి న్యాయం జరిగేలా కళాశాల యాజమాన్యంతో చర్చలు జరుపుతున్నారు. కష్టకాలంలో మిత్రుడి బాధను తమ బాధగా భావించి సహకారం అందించడం పలువురి ప్రశంసలు అందుకుంది.
మిత్రునికి అండగా నిలిచిన వారిలో సూరి, విష్ణు సాగర్, గట్టు శశి, జీఆర్ బ్రదర్స్ రఘు, గుంట కృష్ణ, బాలరాజు, విజయ్‌తో పాటు పలువురు రాజకీయ నాయకులు, స్వర్ణకారులు ఉన్నారు. బాల్యమిత్రుల సహకారం మానవత్వానికి, నిజమైన మిత్రత్వానికి నిదర్శనంగా నిలిచింది.

### నేరళ్లపల్లి అభివృద్ధికి
## హెచ్ఎండీఏ నిధులు ఇవ్వండి!

- ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డికి నేరళ్లపల్లి గ్రామస్థుల వినతి!



**బాలానగర్, అక్టోబర్ 19(జనంసాక్షి):**
బాలానగర్ మండలంలోని నేరళ్లపల్లి గ్రామ అభివృద్ధికి హెచ్ఎండీఏ నిధులు కేటాయించాలని గ్రామస్తులు జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డిని కోరారు. సోమవారం ఎమ్మెల్యేను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో మౌలిక సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, రోడ్లు, డ్రైనేజీలు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టేందుకు హెచ్ఎండీఏ నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. హెచ్ఎండీఏ నిధులతో గ్రామంలో మౌలిక వసతులు మెరుగుపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జమీర్ తో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

# విజయదశమి శుభాకాంక్షలు...

- ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలి
- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి



**కొల్చారం, అక్టోబర్ 19 (జనంసాక్షి):** నర్సాపూర్ నియోజకవర్గ ప్రజలందరికీ విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. దసరా పండుగ ప్రతిఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు నింపాలని ఆకాంక్షించారు. ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలని, ప్రజలందరూ సుఖశాంతులతో, సంతోషంగా జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. దుర్గామాత ఆశీస్సులు నర్సాపూర్ నియోజకవర్గ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రజల జీవితాల్లో విజయాలు, శ్రేయస్సు కలగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

## రాయపల్లి శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



**రాజాపూర్, అక్టోబర్ 19(జనంసాక్షి):** మండల పరిధిలోని రాయపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన దుర్గామాత ఆలయం లో ఏర్పాటు చేసిన శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సోమవారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ గాయత్రి మల్లేష్ గౌడ్,వెంకట్ రెడ్డి, కేశవులు గౌడ్, ఉదేష్ గౌడ్,లింగం గౌడ్,మహేష్ శ్రీనివాస్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## వెల్దండ ప్రజలకు దసరా పండుగ శుభాకాంక్షలు సర్పంచ్ మట్ట యాదమ్మ మట్ట వెంకటయ్య



**వెల్దండ, అక్టోబర్ 19 (జనంసాక్షి):** విజయదశమి దసరా పండగ సందర్భంగా వెల్దండ గ్రామ ప్రజలకు హృదయపూర్వక విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మట్ట యాదమ్మ మట్ట వెంకటయ్య గౌడ్ మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి పండుగ ప్రతీ ఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగులను, సంతోషాలను నింపాలని ఆకాంక్షించారు. దుర్గామాత ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో విలసిల్లాలని, ప్రజలందరూ ఈ పండుగను శాంతియుత వాతావరణంలో, ఆనందోత్సాహాల మధ్య సోదరభావంతో జరుపుకోవాలని, ప్రతి అడుగు విజయవంతం కావాలని గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ మట్ట వెంకటయ్య కోరుకున్నారు.

## కబడ్డీ క్రీడాకారులకు టీషర్ట్స్ అందజేత




**ఆత్మకూర్, అక్టోబర్ 19 (జనంసాక్షి):** అమరచింత గ్రౌండ్ టీమ్ కబడ్డీ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కాసిం టీషర్ట్స్ స్పాన్సర్ చేశారు. క్రీడాకారులు పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జట్టుకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఇలాంటి సహకారం యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందని కోచ్‌లు జిలాని, రవి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులకు సరైన ప్రోత్సాహం, శిక్షణ అందిస్తే జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణిస్తారని పేర్కొన్నారు. టీషర్ట్స్ అందించిన కాసింకు క్రీడాకారులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

- అనారోగ్యంతో బాధపడుతున్న వారికి పరామర్శ..
- మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి







**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 19 (జనంసాక్షి):** వనపర్తి పట్టణంతో పాటు రాజనగరం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న వారిని, వివిధ ప్రమాదాలు, ఇతర కారణాలతో మృతిచెందిన వారి కుటుంబాలను వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సోమవారం పరామర్శించారు. బాధితుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకోవడంతో పాటు, మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, వారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.వనపర్తి పట్టణంలోని 18వ వార్డుకు చెందిన సాక్షి రిపోర్టర్ రాజు భార్య జి. సంధ్య గుండె సంబంధిత వ్యాధితో శస్త్రచికిత్స చేయించుకున్న నేపథ్యంలో ఎమ్మెల్యే ఆమెను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ఎలాంటి ఆందోళన చెందవద్దని, అవసరమైన సమయంలో అండగా ఉంటానని రాజుకు భరోసా ఇచ్చారు.అనంతరం 5వ వార్డుకు చెందిన నరసింహ కుమారుడు రవి మృతి చెందడంతో జిల్లా ఆసుపత్రిలో కుటుంబ సభ్యులను పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. 13వ వార్డుకు చెందిన రాజారెడ్డి గుండె శస్త్రచికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.అదే వార్డుకు చెందిన కురుమయ్య కుమారుడు ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందడంతో ఎమ్మెల్యే బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. స్థానిక కౌన్సిలర్ పరుశురాముతో ఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకుని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.పట్టణంలోని 14వ వార్డుకు చెందిన బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థిని సోనా నాదరగుల్‌లోని ఎంవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన దాండియా కార్యక్రమంలో లైటింగ్ నిర్మాణం ప్రమాదవశాత్తు కూలిపోవడంతో మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని వనపర్తిలోని నివాసానికి తీసుకురావడంతో ఎమ్మెల్యే అక్కడికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించి, సోనా మృతదేహానికి నివాళులర్పించారు.అనంతరం రాజనగరం గ్రామంలో గుండేటి సురేష్ మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సురేష్ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.అదే గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గొడుగు వెంకటయ్య ముదిరాజ్ ఇటీవల శస్త్రచికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా ఎమ్మెల్యే ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కదిరె రాములు, మార్కెట్ యార్డ్ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు వెంకటేష్, అరుణ బ్రహ్మచారి, పాకనాటి కృష్ణయ్య, బి. కృష్ణయ్య, ఏర్పుల రవి, రాజు, రఘు యాదవ్, పరుశురాములు, పాల రవి, మైనార్టీ నాయకుడు బషీర్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాల్వాయిలో కబడ్డీ పోటీలు ప్రారంభించిన డీకే స్నిగ్ధారెడ్డి



**మల్దకల్, అక్టోబర్ 19 (జనంసాక్షి):** దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పాల్వాయి గ్రామంలో నిర్వహించిన కబడ్డీ పోటీలను బీజేపీ జిల్లా యువనాయకురాలు డీకే స్నిగ్ధారెడ్డి ప్రారంభించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని, గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తే ఉన్నత స్థాయికి ఎదుగుతారని పేర్కొన్నారు. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, రామచంద్రారెడ్డి, తిరుపతిరెడ్డి, పాల్వాయి రాముడు తదితరులు పాల్గొన్నారు.

## దుర్గామాతకు ఉప్పల వెంకటేష్ ప్రత్యేక పూజలు



**వెల్దండ, అక్టోబర్ 19 (జనంసాక్షి):** వెల్దండ మండల కేంద్రంలోని బుధవారం పేట ఆంజనేయ స్వామి దేవాలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. పూజా కార్యక్రమాలకు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ అధ్యక్షులు అల్లంపల్లి కృష్ణ పూరి రమేష్ ఉప్పల వెంకటేష్ ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు వాసా తిరుపతయ్య రమేష్ దాచేపల్లి శ్రీనివాసులు ఉప్పు ఆంజనేయులు బిక్కుమాండ్ల శ్రీనివాసులు సంతోష్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ కమిటీ చైర్‌పర్సన్‌గా వాకిటి లలిత



**మక్తల్, అక్టోబర్ 19 (జనంసాక్షి):** మక్తల్ నియోజకవర్గం బతుకమ్మ కమిటీ చైర్పర్సన్‌గా వాకిటి లలితని మహిళా సంఘాల సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వాకిటి లలితను మంత్రి వాకిటి శ్రీహరి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం వాకిటి లలిత మాట్లాడుతూ బతుకమ్మ కమిటీ చైర్‌పర్సన్‌గా తనను ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు తెలియజేశారు. నియోజవర్గ మహిళలు బతుకమ్మ కమిటీ చైర్‌పర్సన్‌గా తనపై పెద్ద బాధ్యతను ఉంచారని, వచ్చే ఏడాది మరింత ఘనంగా బతుకమ్మ సంబరాలను నిర్వహించేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. బతుకమ్మ సంబరాలను తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు నుంచే ప్రతి పల్లెపల్లెనా నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. మక్తల్ పట్టణంలో రాంలీలా మైదానంలో మాత్రం పెద్ద ఎత్తున బతుకమ్మ సంబరాలు నిర్వహించడం ఇది రెండో ఎడాది అని గుర్తు చేశారు. బతుకమ్మ పండగకు అన్ని విధాలుగా సహకరిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూరులో 25 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ



**ఆత్మకూర్, అక్టోబర్ 19 (జనంసాక్షి):** ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో అర్హులైన 25 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను సోమవారం పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ జి. నాగమణి, వైస్ చైర్మన్ ఎం. శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ ఎ. నరేష్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎండి రహమతుల్లా, డిసిసి జిల్లా కార్యదర్శి తులసి రాజ్ యాదవ్ పాల్గొని లబ్ధిదారులకు పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాట్లాడుతూ, పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు.ఈ పథకం పేద కుటుంబాలకు ఎంతో ప్రయోజనకరమని, లబ్ధిదారులు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ పారదర్శకంగా మంజూరు పత్రాలు అందిస్తున్నామని, లబ్ధిదారులు అధికారుల సూచనలు పాటిస్తూ నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు.

పేదలకు సొంత ఇల్లు కల్పించాలనే ప్రభుత్వ సంకల్పం అభినందనీయమని, ఈ పథకం ద్వారా లబ్ధిదారుల జీవితాల్లో స్థిరత్వం, భద్రత ఏర్పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# మద్యం మత్తు.. మూడు కుటుంబాల్లో విషాదం!

- **కాటికి ఒకరు.. ఆస్పత్రిలో మరొకరు!**

**రాజోళి/వడ్డేపల్లి, అక్టోబర్ 19 (జనంసాక్షి):** మద్యం మత్తులో కారు నడిపిన వ్యక్తి నిర్లక్ష్యం మూడు కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపింది. ఈ నెల 17న అలంపూర్ చౌరస్తా నుంచి ఆటోలో వెళ్తున్న వారిని బొంకూరు-పెద్దపోతులపాడు రహదారిపై కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా, మరో విద్యార్థిని తీవ్రంగా గాయపడింది. కారు నడిపిన మహేష్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని బాధితులు ఆరోపిస్తున్నారు.



**తండ్రి కల నెరవేరకుండానే..**

వడ్డేపల్లి మండలం తిమ్మాజిపల్లెకు చెందిన లావణ్య చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయింది. ఆయన కలను నెరవేర్చాలనే పట్టుదలతో కష్టపడి చదివి, జగిత్యాల జిల్లా కోరుట్ల వెటర్నరీ కళాశాలలో సీటు సాధించింది. మూడో సంవత్సరం చదువుతున్న ఆమె ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మృతి చెందింది. ఉన్నత చదువులు పూర్తి చేసి కుటుంబానికి అండగా నిలవాలన్న ఆమె ఆశలు అడియాశలయ్యాయి.



**ఆస్పత్రిలో ఉషారాణి పోరాటం**

రాజోళి మండలం ముండ్లదిన్నెకు చెందిన పెద్దింటి ఉషారాణి కూడా అదే కళాశాలలో మూడో సంవత్సరం చదువుతోంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. రెండు కాళ్లు కదలలేని పరిస్థితితో పాటు ఊపిరితిత్తులకు సమస్య ఏర్పడినట్లు కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. మెరుగైన వైద్యం కోసం ఆమెను హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ఉషారాణి త్వరగా కోలుకోవాలని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ప్రార్థిస్తున్నారు.



**నలుగురు కూతుళ్లకు తండ్రి దూరం**

ఈ ప్రమాదంలో శాంతినగర్‌కు చెందిన జోగి దుర్గ కూడా ప్రాణాలు కోల్పోయాడు. తాళాలు రిపేరు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న ఆయనకు నలుగురు కూతుళ్లు ఉన్నారు. వారి భవిష్యత్తు కోసం కష్టపడిన దుర్గ మరణంతో ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది.

**బాధిత కుటుంబాలను ఆదుకోవాలి**

ప్రమాదానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబాలు, గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. లావణ్య, దుర్గ కుటుంబాలకు పరిహారం అందించి, ఉషారాణికి మెరుగైన వైద్యం అందించాలని కోరుతున్నారు. దుర్గపై ఆధారపడిన నలుగురు కూతుళ్లను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



# 24 గంటల కరెంటు హామీ ఏమైంది?

- **విద్యుత్ ఎస్ఈ కార్యాలయం ఎదుట రైతుల నిరసన దీక్ష**



**గద్వాల,అక్టోబర్ 10 (జనంసాక్షి):** ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన 24 గంటల ఉచిత విద్యుత్ హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు కిష్టన్న ఆధ్వర్యంలో గద్వాల పట్టణంలోని విద్యుత్ ఎస్ ఈ కార్యాలయం ఎదుట రైతుల నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా యువ నాయకురాలు డీకే స్నిగ్ధ రెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వస్తే వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని ఎన్నికల సమయంలో ఊదరగొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం, నేడు కనీసం 5 నుంచి 6 గంటల సరఫరా కూడా ఇవ్వలేక చేతులెత్తేసిందని విమర్శించారు. జిల్లా వ్యాప్తంగా రైతులు రోడ్లపైకి వచ్చి సబ్ స్టేషన్లను ముట్టడించడమే కాంగ్రెస్ అబద్ధాల పాలనకు నిదర్శన మన్నారు. పంటలు చేతికొచ్చే కీలక సమయంలో అప్రకటిత విద్యుత్ కోతలు విధించడం వల్ల బోర్లలో నీరున్నా తోడుకోలేక వేలాది ఎకరాల్లో పంటలు కళ్లముందే ఎండిపోతున్నాయని, సరైన ప్రణాళిక లేని రేవంత్ సర్కారు నిర్లక్ష్యం వల్ల రైతులు తీవ్ర నష్టాల్లో కూరుకుపోతున్నారని అన్నారు. విద్యుత్ కోతలకు తోడు తీవ్రమైన లో-వోల్టేజీ సమస్య రైతులను నిలువునా ముంచుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

# మిషన్ భగీరథ నీళ్లు బంద్.. దాహార్తితో ప్రజలు
## మంచినీటి సరఫరాను పునరుద్ధరించాలి

- **అదనపు కలెక్టర్‌కు సిపిఎం వినతి**



**నారాయణపేట, అక్టోబర్ 19(జనంసాక్షి):** నారాయణపేట మండలం శాసనపల్లి సంపు హౌస్ నుంచి వచ్చే మిషన్ భగీరథ నీళ్లు పూర్తిగా ఆగిపోయాయని, వారం రోజులు గడుస్తున్న అధికారులు పట్టించుకోవడంలేదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండమీది బలరాం, జిల్లా నాయకులు దస్తప్ప, నరహరిలు జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనుకు సోమవారం రోజు వినతి పత్రం అందజేశారు.

ఎల్‌నినో ప్రభావం వలన ఎండలుమండుతున్నాయని గ్రామాలలో మంచి నీటి ఎద్దడి ఏర్పడడం వలన ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోటకొండ చుట్టూ ఉన్న 15 గ్రామాలకు మంచినీటి సరఫరా ఆగిపోవడంతో ప్రజల తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. చీటికిమాటికి పైపులైను మరమ్మతు ఉందని, నీటి మోటార్లు చెడిపోయాయని అధికారులు తెలుపుతున్నా రని కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. కలెక్టర్ స్పందిస్తూ అక్కడే ప్రజావాణిలో ఉన్న మిషన్ భగీరథ అధికారులను పిలిపించి నీటి సమస్యపై ఆరతీశారు. నీటి సరఫరాను వెంటనే చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గోటూర్ మల్లేష్, చుక్క గోవిందు, వెంకటేష్ , పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఉల్లిగేపల్లిలో యథేచ్ఛగా అక్రమ మట్టి దందా

- **అధికారుల అనుమతి ఉందంటూ మట్టి తరలింపు**
- **ట్రాక్టర్ మట్టి రూ.500-600కు విక్రయం**

**మల్దకల్ అక్టోబర్ 19 (జనంసాక్షి):** మండల పరిధిలోని ఉల్లిగేపల్లి గ్రామంలో నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం ప్రధాన కాలువ వద్ద మట్టిని అక్రమంగా తరలిస్తూ వ్యాపారం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామ అభివృద్ధి చెరువుకు నీటిని తరలించే పనుల ముసుగులో మట్టిని ట్రాక్టర్‌కు రూ. 500-600 చొప్పున విక్రయిస్తున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పోలీస్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల అనుమతులతోనే మట్టి తరలిస్తున్నామని కొందరు చెబుతున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు స్పందించి, మట్టి తరలింపునకు అనుమతులు ఉన్నాయా..? అక్రమ మట్టి దందా జరుగుతోందా..? అనే అంశాలపై విచారణ చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మండలంలోని అధికారులు కూడా చూసి చూడనట్లు వ్యవహరించడం వల్ల గ్రామస్తులు అధికారులపై ఆగ్రహంవ్యక్తం చేస్తున్నారు. పట్టపగలే మట్టి దొంగ దందా నడుస్తున్నప్పటికీ అధికారులు మాత్రమే ఎందుకు మౌనంగా ఉన్నారని, వాళ్లకు మామూలు ఇచ్చి మట్టిని కొట్టుకోమని చెప్పారా... లేదా ఎవరేమి చేరే అనే విధంగా ఉన్నారని పలువురు గ్రామస్తులు రైతులు బహిరంగ విమర్శిస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే మట్టి దందను అరికట్టి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# మెడికల్ సీట్ సాధించిన విద్యార్థినిలకు సన్మానం



**మల్దకల్, అక్టోబర్ 19 (జనంసాక్షి):** మండల కేంద్రానికి చెందిన ఇద్దరు ఆర్యవైశ్య విద్యార్థినులు ఎంబిబిఎస్ సీటు సాధించడం పట్ల ఆర్యవైశ్య సంఘం నాయకులు విద్యార్థులను సోమవారం సన్మానించారు. మల్దకల్ కు చెందిన పళ్ళ వెంకటయ్య కుమారుడు చిన్న నరసింహయ్య కూతురు పల్లా లక్ష్మీదేవి, సింగినేడి బుదయ్య పెద్ద కుమారుడు నరసింహయ్య కూతురు సింగినేడి శ్రీజ లు ఎంబీబీఎస్ సీటు సాధించడం పట్ల మల్దకల్ ఆర్యవైశ్య సంఘం నాయకులు వారి ఇంటికి వెళ్లి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గనేకల్ రామకృష్ణ, సింగనేడి నరసింహయ్య, నరహరి ప్రవీణ్ కుమార్, పల్లా చిన్న నరసింహయ్య, గనేకల్ వీరేష్ మనసాని ప్రదీప్ కుమార్, బాదంరాజు, పల్లా సంతోష్ కుమార్, బిలకంటి అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ మహిషాసుర మర్దిని దేవిగా వాసవి మాత



**మల్దకల్ అక్టోబర్ 19 (జనంసాక్షి):** శ్రీ వాసవి మాత నవరాత్రి ఉత్సవాలలో 9వ రోజు శ్రీ మహిషాసుర మర్దిని దేవిగా అలంకరించి పూజలు అందుకున్నారు. ఆదిశిలా క్షేత్రం మల్దకల్‌లో వెలిసిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో సోమవారం చాముండి యాగంను వేద పండితులు చైతన్య నిర్వహించగా ఆలయ అర్చకులు రవి ప్రద్యుమ్నులు అమ్మవారికి అలంకారం పూజలు నిర్వహిం చారు. పూజల అనంతరం విఐపిలను జర్నలిస్టులను సన్మానిం చారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మనసాని నాగరాజు మాట్లాడుతూ అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించినందున ప్రతి ఒక్కరికి ధన్యవాదములు తెలిపారు. ఈ సందర్భంగా అభిషేక పూజాదాత ఇస్కాల రత్నమ్మ అండ్ సన్స్ మల్దకల్ వారు నిర్వహించగా వారికి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో బాదం శ్రీని వాసులు అభివృద్ధి కమిటీ అధ్యక్షులు, గణేకల్ రామకృష్ణ, మండల అవోప ప్రధాన కార్యదర్శి, నరహరి సూరిబాబు, పట్టణ ఉపాధ్యక్షులు, పల్లా వెంకటేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు మహిళా భక్తులతో పాటు సీతారాం రెడ్డి, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఊట్కూర్‌ను ముంపు గ్రామంగా ప్రకటించాలి

- **మక్తల్‌కు సాగునీటిపై శ్వేతపత్రం విడుదల చేయాలి**
- **మక్తల్-నారాయణపేట రోడ్డు పనులు వెంటనే చేపట్టాలి: చిట్టెం**



**నారాయణపేట జిల్లా బ్యూరో, అక్టోబర్ 19 (జనంసాక్షి):** నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా ఊట్కూర్ చెరువు విస్తరణ, కట్ట ఎత్తు పెంపుతో గ్రామానికి ముంపు ప్రమాదం ఉందని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఊట్కూర్‌ను ముంపు గ్రామంగా ప్రకటించి ప్రజల భద్రతకు చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనుకు వినతిపత్రం అందజేశారు. మక్తల్ నియోజకవర్గంలో ఎన్ని చెరువులు నింపుతారు, ఎన్ని ఎకరాలకు సాగునీరు అందిస్తారనే వివరాలతో ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్పందించకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. మరోవైపు మక్తల్-నారాయణపేట ప్రధాన రహదారి పనులు వెంటనే ప్రారంభించాలని రామ్మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. రహదారి దుస్థితిని నిరసిస్తూ 30 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. గుంతల కారణంగా వాహనదారులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారని, అంబులెన్సులు సైతం సకాలంలో చేరుకోలేకపోతున్నాయని పేర్కొన్నారు. రూ. 237 కోట్లతో శంకుస్థాపన చేసినప్పటికీ పనులు ముందుకు సాగడం లేదని విమర్శించారు. నాలుగు నెలల క్రితం 170 గుంతలు ఉండగా, మంత్రి సీతక్క పర్యటన సమయానికి 700కు చేరాయని తెలిపారు. ప్రభుత్వం వెంటనే పనులు ప్రారంభించి పూర్తి చేయాలని, లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సుధాకర్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, రహ్మాన్, తరుణ్, ఆనంద్ రెడ్డి, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు కోరం శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా ఆయుధ, వాహన పూజలు

- శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్పీ వినీత్



**నారాయణపేట జిల్లా బ్యూరో, అక్టోబర్ 19(జనంసాక్షి):** విజయదశమి పర్వదినాన్ని పురస్కరించు కుని నారాయణపేట జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ కార్యాలయం లోని ఆర్మడ్ రిజర్వ్ విభాగంలో సోమవారం ఆయుధ పూజ, వాహన పూజలను ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్, ప్రీతి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి, జిల్లా ప్రజలందరికీ విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాల యంలోని ఆర్మడ్ రిజర్వ్ విభాగంలో ఆయుధ పూజ నిర్వహించి, విధి నిర్వహ ణలో కీలక పాత్ర పోషించే ఆయుధాలకు సంప్రదా యబద్ధంగా పూజలు చేశారు. శక్తికి, ధైర్యానికి, విజయానికి ప్రతీకగా నిలిచే దుర్గామాతను ప్రార్థిస్తూ, పోలీస్ సిబ్బంది ప్రజల రక్ష ణ, శాంతిభద్రతల పరిర క్షలో మరింత అంకిత భావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. అదేవిధంగా పరేడ్ గ్రౌండ్ లో వాహనాల కు ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ప్రజల భద్రత, నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, అత్యవసర సమయాల్లో సత్వర సేవలు అందించ డంలో పోలీస్ వాహనాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. పోలీస్ సిబ్బం ది విధి నిర్వహణలో ఎల్ల ప్పుడూ అప్రమత్తంగా ఉంటూ, ప్రజలకు సమర్థ వంతమైన సేవలు అందిం చాలని సూచించారు. విజయదశమి చెడుపై మంచి సాధించిన విజయా నికి ప్రతీకగా నిలిచే పవిత్ర మైన పండుగ అని పేర్కొ న్నారు. దుర్గామాత ఆశీ స్సులతో ప్రతి ఒక్కరి జీవి తంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియా లని ఆకాంక్షించారు. జిల్లా ప్రజలు విద్య, ఉద్యోగ, వ్యాపార, వ్యవసాయ తదితర అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ విజయ పథంలో ముందుకు సాగా లని కోరుకున్నారు. ప్రజ లందరూ పరస్పర ప్రేమా భిమానాలతో, సోదరభా వంతో పండుగను ఆనందో త్సాహాల మధ్య జరుపుకో వాలని పిలుపునిచ్చారు.

విజయదశమి పండుగ పోలీస్ సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు కూడా సుఖసంతోషాలు, ఆరో గ్యం, విజయాలను అందిం చాలని జిల్లా ఎస్పీ ఆకాం క్షించారు. ప్రజల సహకా రంతో జిల్లాలో శాంతిభద్ర తలను మరింత పటిష్టంగా కొనసాగిస్తూ, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేందుకు జిల్లా పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రియాజ్ హుల్ హక్, డీఎస్పీ నల్లపు లింగయ్య, ఆర్ ఐ విజయ్ భాస్కర్, ఎస్సై లు వెంకటేశ్వర్లు, సునీత, శివ శంకర్, శిరీష, కృష్ణ చైతన్య, ఆర్ముడు రిజర్వ్ పోలీసు లు, సిబ్బంది తది తరులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణ శంఖారావాన్ని విజయవంతం చేద్దాం

- రాష్ట్ర నాయకులు కే.భీంసేన్ రావ్



**నారాయణపేట, అక్టోబర్ 19 (జనంసాక్షి):** బ్రాహ్మణ ఆర్గనైజేషన్ ఫర్ సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో ఈ నెల 25న జడ్చర్ల వాసవి కళ్యాణ మండపంలో మధ్యాహ్నం 2 గంటలకు ఉమ్మడి పాలమూరు జిల్లా బ్రాహ్మణ శంఖారావం నిర్వహించనున్నట్లు రాష్ట్ర నాయకుడు కొల్లూర్ భీంసేన్ రావు తెలిపారు. కార్యక్రమానికి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు, బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ బసవరాజు శ్రీనివాసు హాజరవుతారని పేర్కొన్నారు. నారాయణపేట జిల్లా నుంచి బ్రాహ్మణులు, మహిళా సంఘాలు, భజన మండలి సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంగ్వార్ గోపీనాథ్ రావు, కంసాన్‌పల్లి రఘునాథ్ రావు, ఉట్కూర్ విశ్వావసు పురోహిత్ తదితరులు పాల్గొన్నారు.

# అనుమతుల పేరుతో... నంబర్ ప్లేట్ లేని ఇసుక రవాణా!



- నిబంధనలు బేఖాతర్.. అధికారుల అనుమతుల మాటున అక్రమదందా?
- మరో గ్రామంలో ఇసుక డంపులు.. సొంత గ్రామానికి ఇసుక తరలిస్తున్నాం
- అనుమతులు మాకెందుకు అంటూ ఇసుక నిర్లక్ష్యపు వ్యాపారుల సమాధానాలు

**మహమ్మదాబాద్, అక్టోబర్ 19(జనంసాక్షి):** మహమ్మదాబాద్ మండలంలో ఇసుక అక్రమ రవాణాకు అడ్డూ అదుపూ లేకుండా పోతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనుమతులు ఉన్నాయనే పేరుతో నిబంధనలను తుంగలో తొక్కుతూ, ట్రాక్టర్లకు నంబర్ ప్లేట్లు లేకుండానే ఇసుక తరలిస్తున్న ఘటనలు మహమ్మదాబాద్ మండలంలో చోటు చేసుకుంటున్నాయి. మండలంలోని, ధర్మపుర్ వాగు నుంచి రాగారిపల్లి వైపు ఇసుక తరలిస్తున్న క్రమంలో నంబర్ ప్లేట్ లేని ట్రాక్టర్ కనిపించడంతో ఈవ్యవహారం చర్చనీయాంశంగా మారింది. మండలంలోని పలు గ్రామాల్లో రాత్రి వేళల్లో ఇసుక రవాణా జోరుగా సాగుతోందని స్థానికులు



ఆరోపిస్తున్నారు. అధికారులు జారీ చేసిన అనుమతి పత్రాల్లో ట్రాక్టర్ నంబర్, ట్రాలీ నంబర్, డ్రైవర్ పేరు వంటి వివరాలు స్పష్టంగా ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం నిబంధనలు అమలవుతున్నాయా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అనుమతి పత్రంలో పేర్కొన్న వివరాలకు భిన్నంగా ఇతర డ్రైవర్లతో రవాణా సాగిస్తున్నారన్న ఆరోపణలపైనా విచారణ జరగాల్సిన అవసరం ఉంది.

**ట్రాక్టర్ నెంబర్ ప్లేట్ ఊడిపోయింది డ్రైవర్ సమాధానం...**

వెంకట్‌రెడ్డిపల్లి గ్రామ పరిధిలోని ధర్మపుర్ వాగు నుండి నంబర్ ప్లేట్ లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను నంబర్ ప్లేట్ ఎక్కడ, ఇసుక రవాణాకు అనుమతు లు ఉన్నాయా అని డ్రైవర్ ని ప్రశ్నించగా, నంబర్ ప్లేట్ ఊడిపోయిందని, దానికి తనకు సంబంధం లేదన్నట్లుగా, సమాధానం ఇచ్చాడు. వాహనానికి గుర్తింపు తెలిపే నంబర్ ప్లేట్ లేకుండానే ఇసుక రవాణా ఎలా సాగుతోంది? అనుమతులు జారీ చేసే సమయంలో అధికారులు వాహనాల వివరాలను పరిశీలిస్తున్నా రా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**ట్రాక్టర్ నంబర్ ప్లేట్ లేకుండా అనుమతులు ఎలా ఇస్తున్నారు?**

అసలు నంబర్ ప్లేట్ లేని ట్రాక్టర్‌కు ఇసుక రవాణా అనుమతులు ఎలా జారీ అయ్యాయి? అనుమతి పత్రంలో పేర్కొన్న నిబంధనలను పర్యవేక్షించాల్సిన బాధ్యత ఎవరిది?

మహమ్మదాబాద్ తహసీల్దార్ కార్యాలయం నుంచి అను మతులు పొందిన వాహనాలు నిబంధనల ప్రకారమే ఇసుక తరలిస్తున్నాయా? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

అనుమతులు ఉన్నాయనే సాకుతో నిబంధనలను ఉల్లంఘిస్తే, వాటిని పర్యవేక్షించాల్సిన యంత్రాంగం ఏం చేస్తున్నదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనలను పక్కనపెట్టి ఇసుక రవాణా జరుగుతోందన్న ఆరోపణలపై అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, వాస్త వాలను నిగ్గుతేల్చాల్సిన అవసరం ఉంది.

**స్పందించని మహమ్మదాబాద్ తహసీల్దార్!**

నంబర్ ప్లేట్ లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ఘటనపై వివరణ కోరేందుకు మహమ్మదాబాద్ తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డిని, జనంసాక్షి ప్రతినిధి ఫోన్ ద్వారా సంప్రదించేందుకు ప్రయత్నించగా ఆయన స్పందించలేదు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా జరుగుతోందన్న ఆరోపణలపై రెవెన్యూ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారు? అనుమతి పత్రాలను పరిశీలించి బాధ్యులపై విచారణ చేపడతారా లేక ఈ వ్యవహారం ఇలాగే కొనసాగుతుందా? అన్నది వేచి చూడాల్సిందే.

# పాలమూరు రెవెన్యూ అధికారుల తీరుపై యువకుడి పాదయాత్ర

- కలెక్టరేట్ నుంచి ఈసీ వరకు..
- పాలమూరు నుంచి హైదరాబాద్‌కు పాదయాత్ర చేపట్టిన రాఘవేంద్ర రాజు
- విజయదశమి నాడు పాదయాత్ర ప్రారంభం - న్యాయం కోసం పోరాటం

మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 19 (జనం సాక్షి)

పాలమూరు జిల్లాలో రెవెన్యూ అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వహించడం లేదని ఆరోపిస్తూ ఓ యువకుడు పోరాట బాట పట్టాడు. విజయదశమి రోజున మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్ నుంచి రాఘవేంద్ర రాజు తన పాదయాత్రను ప్రారంభించారు. పాలమూరు నుంచి



హైదరాబాద్‌లోని ఎన్నికల కమిషన్ కార్యాలయం వరకు ఈ పాదయాత్ర కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.

ప్రజలకు న్యాయం జరగాలనే ఉద్దేశంతోనే అధికారుల తీరును నిరసిస్తూ ఈ యాత్ర చేపట్టినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అంశాన్ని ప్రస్తావిస్తూ, ఓ నాయకుడు ఎన్నికల సమయంలో రెండు ఓట్లతో పాటు ఎన్నికల కమిషన్‌కు చూపించకుండా ఎన్నికల బరిలో నిలిచారని ఆయన ఆరోపించారు. రెవెన్యూ అధికారుల విధుల నిర్వహణ, ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అంశాలపై తన నిరసనను తెలియజేయడమే లక్ష్యంగా ఈ పాదయాత్ర చేపట్టినట్లు సమాచారం. అయితే, ఆయన చేసిన ఆరోపణలపై సంబంధిత అధికారుల వివరణ తెలియాల్సి ఉంది.



# సంగారెడ్డిలో దసరా వేడుకలకు ముమ్మర ఏర్పాట్లు

## అంబేద్కర్ స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలించిన జగ్గారెడ్డి





**సంగారెడ్డి, అక్టోబర్ 19 (జనంసాక్షి):** సంగారెడ్డి పట్టణంలోని అంబేద్కర్ స్టేడియంలో దసరా వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. సోమవారం రాత్రి జగ్గారెడ్డి స్టేడియాన్ని సందర్శించి వేదిక నిర్మాణం, సౌండ్ సిస్టమ్, ప్రేక్షకుల సీటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు.

**ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి...**

వేడుకలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్నందున సీటింగ్ ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జగ్గారెడ్డి సూచించారు. ప్రధాన వేదిక ముందు అధికారులు, ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులకు ప్రత్యేక సీటింగ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. సామాన్య ప్రజలు సైతం సౌకర్యవంతంగా కార్యక్రమాలను వీక్షించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, కళాకారుల ప్రదర్శనలు స్టేడియంలోని చివరి వరుసలో కూర్చున్నవారికి సైతం స్పష్టంగా వినిపించేలా అత్యాధునిక సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని సూచించారు.

**రావణ దహనానికి భద్రతా చర్యలు...**

స్టేడియంలో ఏర్పాటు చేసిన భారీ రావణాసురుడి ప్రతిమను జగ్గారెడ్డి పరిశీలించారు. రావణ దహనం సమయంలో ప్రజలకు ఎలాంటి ప్రమాదం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. బాణాసంచా ప్రదర్శన నిర్వహణలో భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ప్రేక్షకులకు సురక్షిత దూరంలో కార్యక్రమాలు నిర్వహించాలని స్పష్టం చేశారు.

గత మూడు దశాబ్దాలుగా జగ్గారెడ్డి ఆధ్వర్యంలో సంగారెడ్డిలో దసరా వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. భారీ రావణాసురుడి దహనం, బాణాసంచా ప్రదర్శనలు, ప్రముఖ కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. బతుకమ్మ సంబరాలతో పండుగ శోభను సంతరించుకున్న పట్టణంలో విజయదశమి వేడుకల కోసం ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, నాయకులు జార్జ్, బొంగుల రవి, కూన సంతోష్, కిరణ్ గౌడ్, మహేష్ ముదిరాజ్, శ్రీకాంత్ గౌడ్, శ్రీహరి, బెస్త నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## యువజన సాంస్కృతిక పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

- అక్టోబర్ 29న సంగారెడ్డిలో జిల్లా స్థాయి పోటీలు

**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 19 (జనంసాక్షి):** వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్--2027లో భాగంగా 30వ జాతీయ యువజన ఉత్సవాల ప్రాథమిక ఎంపిక కోసం ఈ నెల 29న సంగారెడ్డిలో జిల్లా స్థాయి సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి టి. అఖిలేశ్ రెడ్డి తెలిపారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. జానపద నృత్యం, జానపద గీతాలు, చిత్రలేఖనం, వీధి నాటకాలు, కవితా రచన విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారు. 15 నుంచి 29 ఏళ్ల వయస్సు కలిగి, సంగారెడ్డి జిల్లాలో నివసిస్తున్న లేదా చదువుకుంటున్న యువతీ యువకులు అర్హులు.

మై భారత్ పోర్టల్‌లో నమోదు తప్పనిసరి. గత మూడేళ్లలో జాతీయ యువజన ఉత్సవాల్లో పాల్గొన్నవారు అర్హులు కారు. ఒక్కరు ఒక విభాగంలో మాత్రమే పాల్గొనాలి.

ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 27లోగా సంగారెడ్డి కలెక్టరేట్ రెండో అంతస్తులోని జిల్లా యువజన, క్రీడల అధికారి కార్యాలయంలో ఆధార్ నకలు, వయస్సు ధ్రువీకరణ పత్రం, మూడు పాస్‌పోర్టు ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలి.

జిల్లా విజేతలు రాష్ట్ర స్థాయికి, అక్కడ ప్రతిభ కనబరిచినవారు 2027 జనవరి 10 నుంచి 12 వరకు న్యూఢిల్లీలో జరిగే జాతీయ కార్యక్రమానికి ఎంపికవుతారు. వివరాలకు 7386191141, 7981798957, 8431639907 నంబర్లను సంప్రదించాలని అధికారి కోరారు.

## పాలపిట్టను బంధిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు..

- ఎస్ఐ క్రాంతికుమార్ పటేల్..



**ఝరాసంగం, అక్టోబర్ 19 (జనంసాక్షి):** దసరా పండగ పర్వదినాన పాలపిట్టను చూస్తే శుభసూచకమనే నానుడి సమాజంలో ఉందని అదే పాలపిట్టను బంధించినా లేదా దారంతో కట్టేసినా నేరమని చట్టం చెబుతుందని అలాంటి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఝరాసంగం ఎస్ఐ పాటీల్ క్రాంతికుమార్ అన్నారు. సోమవారం పోలీస్‌స్టేషన్లో జహీరాబాద్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ జీ. స్వామితో కలిసి దసరా రాష్ట్ర పక్షి పాల పిట్టకు కాకూడదు దుర్దినం అనే గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలపిట్టను బందించినా, ప్రదర్శనలకు ఉపయోగించినా, దారాలతో కట్టేసినా, రెక్కలు కత్తరించినా వన్యప్రాణి సంరక్షణా చట్టం ప్రకారం నేరమని వారిపై చట్టరిత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వన్యప్రాణులు, పక్షులను స్వేచ్ఛగా అడువులలో విహరించేలా చూసే బాధ్యత ప్రతి ఒక్కరిదని ఎస్ఐ తెలిపారు. ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే 9803338666, 040-23231440 టోల్ ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

# కౌడిపల్లిలో కనీవినీ ఎరుగని రీతిలో సద్దుల బతుకమ్మ వేడుకలు

- ముఖ్యఅతిథిగా హాజరైన నర్సాపూర్ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి
- మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్పర్సన్ చిలుముల సుహాసిని రెడ్డి
- కౌడిపల్లి సర్పంచ్ చంద్రం కృష్ణ గౌడ్, ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు
- పెద్ద చెరువు మినీ ట్యాంక్‌బండ్ వద్ద మహిళల ఆటపాటల సందడి







**కౌడిపల్లి, అక్టోబర్ 19 (జనంసాక్షి):** మెదక్ జిల్లా కౌడిపల్లిలో సోమవారం సద్దుల బతుకమ్మ వేడుకలను మహిళలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగతో గ్రామమంతా పండుగ శోభను సంతరించుకుంది. రంగురంగుల తంగేడు, గునుగు, బంతి, చామంతి పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

మహిళలు గ్రామపంచాయతీ, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి నివాసం, మార్కెట్‌యార్డు, వివిధ కాలనీల్లో బతుకమ్మలు ఆడుతూ నల్లపోచమ్మ ఆలయానికి చేరుకున్నారు. అనంతరం పెద్ద చెరువు మినీ ట్యాంక్‌బండ్ వద్దకు చేరుకొని గ్రామ పురోహితుడు కొలచాల రాజేశ్వర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంప్రదాయ పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ బతుకమ్మల చుట్టూ ఆడిపాడారు. దీంతో చెరువు పరిసరాలు మహిళల సందడితో కళకళలాడాయి.

ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ చిలుముల సుహాసిని రెడ్డి హాజరయ్యారు. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు, ప్రకృతితో మమేకమైన జీవన విధానానికి ప్రతీక అని వారు పేర్కొన్నారు. మహిళలు, యువతులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం సంతోషకరమన్నారు.

కౌడిపల్లి సర్పంచ్ చంద్రం కృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో వేడుకలకు భారీ ఏర్పాట్లు చేశారు. విద్యుత్ దీపాలతో చెరువు పరిసరాలను అలంకరించడంతో పాటు డీజే సౌండ్ ఏర్పాటు చేశారు. మహిళలు, చిన్నారులు, గ్రామస్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టారు. మహిళలు తమ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని, గ్రామం అభివృద్ధి చెందాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ధర్మ పరిరక్షణకు ప్రతీక ఆయుధ పూజ

- హిందూ సమాజంలో ధైర్యం, ఐక్యత, సేవాభావం పెంపొందించాలి: బాలస్వామి



**నారాయణపేట, అక్టోబర్ 19 (జనంసాక్షి):** హిందూ ధర్మ సంప్రదాయంలో ఆయుధ పూజకు విశిష్ట స్థానం ఉందని విశ్వహిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర ధర్మాచార్య సంపర్క ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి అన్నారు. విజయదశమి సందర్భంగా నారాయణపేట బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో సోమవారం భవానీమాత మందిరంలో ఆయుధ పూజ నిర్వహించారు.

ఈ సందర్భంగా బాలస్వామి మాట్లాడుతూ ఆయుధ పూజ ధర్మ పరిరక్షణకు, సమాజ రక్షణకు, అన్యాయాన్ని ఎదుర్కొనే ధైర్యానికి ప్రతీక అని తెలిపారు. దుర్గామాత మహిషాసురుడిని సంహరించడం, శ్రీరాముడు రావణుడిపై విజయం సాధించడం ధర్మానికి అంతిమంగా విజయం లభిస్తుందనే సందేశాన్ని ఇస్తాయని పేర్కొన్నారు. ఆయుధ పూజ ద్వారా ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, కర్తవ్యనిష్ఠ, ధర్మ పరిరక్షణ పట్ల బాధ్యత పెంపొందించుకోవాలని సూచించారు.

హిందూ సమాజం కుల, మత భేదాలకు అతీతంగా ఐక్యంగా ఉండాలని, పేద, ధనిక తేడాలు లేకుండా పరస్పర గౌరవంతో జీవించాలని పిలుపునిచ్చారు.

బలహీనులకు అండగా నిలవడం, మహిళలను గౌరవించడం, యువతలో దేశభక్తి, సేవాభావం పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఆయుధాలను దాడులకు కాకుండా చట్టబద్ధమైన రక్షణకు, ధర్మబద్ధమైన కర్తవ్యాలకు ఉపయోగించాలని స్పష్టం చేశారు. శక్తిని సమాజ శ్రేయస్సుకు వినియోగించినప్పుడే దానికి సార్థకత లభిస్తుందని తెలిపారు.

కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి శివకుమార్, నగర కార్యదర్శి ప్రవీణ్ కడదాస్, బజరంగ్‌దళ్ జిల్లా కన్వీనర్ శ్రవణ్ కుమార్, గిరీష్, రాజశేఖర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 19వ వార్డులో ఘనంగా బతుకమ్మ సంబరాలు

- మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిన సింగిరెడ్డి వాసంతి



**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 19 (జనంసాక్షి):** వనపర్తి పట్టణంలోని 19వ వార్డులో కౌన్సిలర్ మురళి సాగర్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా సింగిరెడ్డి వాసంతి హాజరై మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తుల్లో పాటలు, కోలాటాలతో సందడి చేశారు.

ఈ సందర్భంగా వాసంతి మాట్లాడుతూ, బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, మహిళల ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. ప్రకృతిని ఆరాధించే ఈ పండుగ సంప్రదాయాలను భావితరాలకు అందించాలని పిలుపునిచ్చారు. మహిళల్లో ఐక్యతను పెంపొందించే ఇలాంటి వేడుకలను ప్రోత్సహించాలని అన్నారు. వనపర్తి ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు.

కార్యక్రమంలో సుగూరు రాజు సాగర్, సత్యం, నారాయణ, శేఖర్, రాజేష్, మంజుల, సుజాత, యాదమ్మ, సుభద్ర, విజయలక్ష్మి, మాధవి, పద్మ తదితరులు పాల్గొన్నారు.



















# శ్రీ దుర్గా దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చిన అమ్మవారు



- **అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, పలువురు ప్రముఖులు**

**రాయికోడు,అక్టోబర్ 19,(జనంసాక్షి):** మండల కేంద్రమైన రాయికోడు తో పాటు జంబిగి, తదితర గ్రామాలలో దేవి నవరాత్రి మహోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 9వ రోజు అయిన అమ్మవారు శ్రీ దుర్గా దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. రాయికోడ్ లోని ముమ్మాదేవి ఆలయం వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు మాహ అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

**అమ్మవారి కృప అందరిపై ఉండాలి మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్..**

రాయికోడు గ్రామంలో ఇంత పెద్ద మొత్తంలో దేవీ నవరాత్రి మహోత్సవ కార్యక్రమాలు నిర్వహించడం చాలా అభినందనీయమని ఆందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ స్పష్టం చేశారు. సోమవారం మామ్మదేవి నవరాత్రి మహోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన డిసిసిబి మాజీ ఉపాధ్యక్షులు జైపాల్ రెడ్డి,మండల బిఆర్ఎస్ అధ్యక్షులు చేవెళ్ల విటల్,రైకోడ్



సర్పంచ్ రాధా తుకారం బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సాయికుమార్, తదితరులతో కలిసి ఆయన పాల్గొని దేవాలయంలో మోక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైకోడ్ లో ఇంత పెద్ద మొత్తంలో ఏర్పాట్లు చేయడం చాలా అభినంద నీయమని అమ్మవారి ఆశీర్వాదంతో ప్రతి ఒక్కరు సుఖసంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల టిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి కే శంకర్ తోపాటు పలు గ్రామాల సర్పంచులు ప్రజాప్రతినిధులు పాల్గొనగా, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం సుధాకర్ రెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సిద్ధన్న పాటిల్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కేదార్నాథ్ పాటిల్, మాజీ అధ్యక్షులు బాలాజీ నర్సింహులు, బసవరాజ్ పటేల్, యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ప్రభాకర్ పలువురు సర్పంచులు, నాయకులు, ఇరు పార్టీల ప్రజా ప్రతినిధులు వేరువేరుగా పాల్గొని అమ్మవారి మొక్కులు చెల్లించుకున్నారు.